క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు నర్వ విద్యార్థినులు



నర్వ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నర్వ కేజీబీవీకి చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శిరీష, పీఈటీ త్రివేణి తెలిపారు. సోమవారం మరికల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సబ్‌జూనియర్ అండర్–16 విభాగంలో సుకన్య, లలితకుమారి, మౌనిక, భారతిలు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలోని ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2021–23 సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థి ఎస్.మహేష్ ఎంబీబీఎస్ సీటు సాంధించినట్లు ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీద్ తెలిపారు.ఈ సందర్భంగిఆ సోమవారం కళాశాలలో విద్యార్థికి అధ్యాపకుల బృందం శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలని ఆకాంక్షించారు.

వాలీబాల్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక



మరికల్: మండల వాలీబాల్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వాలీబాల్ కమిటీ పరిశీలకులు సాయినాథ్, అనంతసేన, నవీన్, వెంకటేశ్ గారి సమీక్షంలో ఎన్నిక జరిగింది. మండల వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాజేష్, ప్రధాన పోషకులుగా సుధాకర్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవిప్రకాష్, కార్యదర్శులుగా సురేష్, అశోక్, కోశాధికారిగా లక్ష్మీకాంత్, ఉపాధ్యాక్షుడిగా రవి, యువరాజ్‌గౌడ్, అంజి, అనిల్ కుమార్ రెడ్డితో పాటు సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్, మహేందర్, ఫారుక్, హుసేన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన



కొత్తపల్లి: మద్దూరు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్, పీహెచ్‌సీ సెంటర్‌లో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటలు పాడుతూ పల్లె సుద్దుల ద్వారా హెచ్‌ఐవీ ఎలా సోకుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెన్నెల కల్చరల్ అకాడమీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నర్సింహ, చెన్నయ్య, ఝాన్సీ, రవిశంకర్, వెంకటేశ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామాన్‌పల్లిలో 'స్వచ్ఛ భారత్'



మక్తల్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మక్తల్ మండలం సామాన్‌పల్లి గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బాల్‌రాంరెడ్డి చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బూత్ అధ్యక్షుడు కుర్మయ్య, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, బీంరెడ్డి, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ధన్వాడలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



మద్దూరులో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: దసరా నవరాత్రులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరి దేవిగా దర్శనమివ్వగా భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు.

■ నారాయణపేటలోని చౌడేశ్వరి మాత ఆలయానికి మహిళలు కలశాల శోభయాత్రతో బయలుదేరి అమ్మవారికి పంచామృతాభిషేకం, మహామంగళ హారతి ఇచ్చి పూజలు జరిపించారు.

■ మద్దూరు మున్సిపల్ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన శంబుని సరస్వతమ్మ నర్సింములు ఆధ్వర్యంలో అమ్మవార్లకు సర్వదేవతా ఆహ్వానం అభిషేకం అనంతరం మహిళలు, కుంకుమార్చన, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కటకం విజయ్ కుమార్, జగన్నాతం, భీంశంకర్,నాగులు,శరత్ బాబు, గిరిబాబు పాల్గొన్నారు.

■ నర్వ దుర్గదేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్వ, లంకాల్, పాథర్చేడ్, పెద్దకడ్మూర్, ఎల్లంపల్లి, రాయికోడ్, కుమార్‌లింగంపల్లి, బెక్కర్‌పల్లి, ఉందేకోడ్, జంగంరెడ్డిపల్లిలో దుర్గమాతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

■ మరికల్ లోని సరస్వతీదేవి ఆలయంలో మొదటి రోజు అమ్మవారు భక్తులకు బాల త్రిపురసుందరి దేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

■ ధన్వాడ మండల కేంద్రంలోని పలు మండపాలలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. స్థానిక రజక సంఘం, బీసీకాలనీలో, గంగాదేవి ఆలయం, వీరభద్రేశ్వరస్వామి దేవాలయం, అంబా భవాని ఆలయం, దత్తాత్రేయ ఆలయంలోనూ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు.

■ కోస్గిలోని సాయిబాబా ఆలయం, మున్నూర్ వీధిలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

■ మక్తల్‌లోని కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే నల్లజానమ్మ ఆలయంలోనూ భక్తులు పూజలు జరిపించారు.



కోస్గిలో బాలత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు



మరికల్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు



నారాయణపేట అశోక్‌నగర్‌లో..



నారాయణపేటలో కలశంతో బయలు దేరుతున్న మహిళలు..



వాసవీమాత ఆలయంలో కలశ పూజలు చేస్తున్న మహిళలు

శక్తిపీఠాన్ని దర్శించుకున్న నటి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మహా సంస్థానం శక్తిపీఠాన్ని సోమవారం సీరియల్ నటి ప్రత్యూష దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా అమ్మవారిని దర్శించుకుని హోమం చేసి భక్తులకు అన్నదానం చేశారు. హోమంలో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు దోమ సుధాకర్ దంపతులు ఇతర భక్తులు పాల్గొన్నారు.



'చలో మక్తల్' విజయవంతం చేద్దాం

మాగనూర్: చలో మక్తల్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మార్పీస్ ఉమ్మడి మండల ఇంచార్జి బోడి తేజ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈనెల 25న నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కావున ఉమ్మడి మండలాల దివ్యాంగులు, వృద్ధులు ,ఒంటరి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

పంట వివరాల నమోదుతో రైతులకు మేలు

కోస్గి రూరల్: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల నమోదుతో పంటల కొనుగోలు ప్రకియ పారదర్శకంగా చేపట్టడంతో పాటు ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. పంటలను నమోదు చేయకపోవడం వల్ల ప్రభుత్వం అందించే రైతు భరోసా, సబ్సిడీలు అందవన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు సాగు చేసిన పంటలను తప్పక నమోదు చేయించుకోవాలన్నారు.

చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం చిరువ్యాపారులకు బ్యాంకు ద్వారా వ్యాపారం చేసుకునేందుకు ఆత్మనిర్భర్ పథకం ద్వారా రుణాలను అందిస్తున్నదని మెప్మా కో ఆర్డినేటర్ యువరాజ్ తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం లోకకల్యాణమేళాలో చిరువ్యాపారులతో పాటు పట్టణ మహిళ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం ఆత్మనిర్భర్ ద్వారా కొత్తగా చిరువ్యాపారులకు మొదటి విడత రూ.15వేలు, రెండో సారి రూ.25వేలు, మూడో పర్యాయం రూ.50వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఐదుగురు చిరువ్యాపారులు గ్రూప్‌గా ఏర్పడితే అలాంటి వారికి వ్యాపారం నిమిత్తం రూ.3లక్షల రుణంగా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలతో పాటు మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్

హాకా ఎరువుల దుకాణం ప్రారంభం

మాగనూర్: మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన హాకా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. హాకా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగులమందులు, ఇతర వ్యవసాయయ పరికరాలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రైతులు హాకా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే హాకా కేంద్రం ద్వారా యాజమానులు రైతులకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు రవీందర్, తిప్పయ్య, మల్‌రెడ్డి, ఉజ్జేల్లి కృష్ణయ్య, పుంజనూర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



హాకా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుదర్శన్ గౌడ్

గుంతలను పూడ్చి వేయించిన అధికారులు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి గుంతలమయంగా మారడంపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గుంతలు పడి మురుగు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆదివారం దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి సోమవారం అధికారులు స్పందించి మట్టి వేసి రోలర్‌తో తొక్కించి చదును చేశారు. గుంతలు పూడ్చడంతో వాహనదారులు, గ్రామస్తులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



గుంతల్లో మట్టివేసి రోలర్‌తో చదును చేయిస్తున్న అధికారులు

ఆవుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నారాయణపేట టౌన్: ఆవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని భజరంగ్ దళ్ విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న ఆవులకు లంపిస్కిన్ వ్యాధి సోకి ఇప్పటికే ఐదు ఆవులు మరణించాయని, ఇంకా 10 ఆవులకు ఈ వ్యాధి సోకిందన్నారు. అదే విధంగా రోడ్లపై తిరుగుతున్న ఆవులతో రాత్రివేళల్లో అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. కావునా ఆవులను గోశాలలకు తరలించాలని లేకపోతే వాటి యాజమానులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, నగర అధ్యక్షుడు సీరటి వెంకటేశ్, విజయ్, ఆకాష్, అనిల్, చక్రి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

నారాయణపేట రూరల్: సహస్రార్జున క్షత్రియ సమాజ్ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర సీఎంసీ సభ్యుడు నందు నామాజీ అన్నారు. సోమవారం పట్టణంలోని ధూల్ పేట ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సత్యానారాయణరావు, ఉపాధ్యక్షుడిగా ఉమాకాంత్, మంత్రిగా నారాయణరావు పవార్, ఉప మంత్రిగా తులసీదాస్, నగేష్, కోశాధికారిగా కిరణ్, నారాయణరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నందు నామాజీ మాట్లాడుతూ సంఘం పేద విద్యార్థులకు చేయూత అందించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కృష్ణా: సీఎం సహాయ నిధి పేదలకు వరమని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని మురహర్‌దొడ్డికి చెందిన నారాయణ, అలాగే దయాల్ సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్సకు సాయమందించాలని సీఎం సహాయ నిధికు దరఖాస్తు చేసుకోగా నగదు మంజూరైంది. మొత్తం రూ.30వేలు మంజూరు కాగా బాధితుల కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సర్ఫరాజ్, సంతోష్ పాటిల్, సురేశ్, నాగప్ప, రాకేష్, బాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలని ధర్నా



ఆత్మకూర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి లక్ష్మినారాయణశెట్టి, జిల్లా నాయకుడు శ్రీహరి, సహాయ కార్యదర్శి మోష, పట్టణ కార్యదర్శి లింగన్న, నాయకులు బాలకృష్ణ, ఖాజపీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు



కృష్ణా: మండలకేంద్రంలో మాగనూర్ పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల పేరిటా ఇసుకను కృష్ణా మండల పరిధిలోని ఇటుకల బట్టీల్లో నిల్వ ఉంచి రాత్రి సమయంలో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఇసుక డంపులను పరిశీలించి సీజ్ చేసినట్లు తెలిపారు. వర్క్యార్‌కు చెందిన లింగప్ప ఇసుకను నిల్వ ఉంచినట్లు తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తోపులాటలో రైతుకు ప్రమాదం

దామరగిద్ద: మండల కేంద్రంలోని రైతు వేదికలో యూరియా పంపిణీ కోసం వ్యవసాయ అధికారులు సోమవారం చేపట్టిన టోకన్‌ల పంపిణీ కార్యక్రమంలో తోపులాట జరగడంతో రైతుకు గాయాలయ్యాయి. లైన్‌లో నిలబడిన నర్సపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకటప్ప కిందపడటంతో కాలు విరిగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే తోటి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రహదారి పరిశీలన



మక్తల్: పట్టణ సమీపంలో ఇంటిగ్రేటెట్ రెసిడెన్సియల్ పాఠశాల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల కోసం రహదారిని పరిశీలించారు. ప్రభుత్వం దాదాపు 25 ఎకరాల్లో పాఠశాలను నిర్మించనుందని, సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తారన్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే ఖరారయ్యే అవకాశం ఉందని కాగ్రెస్ నాయకులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు రవికుమార్, సురేశ్ పాల్గొన్నారు.

చెరువులు, వాగులకు జలకళ

- ఉమ్మడి మండలంలో నిండిన 11 నోటిఫైడ్ చెరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని అన్ని చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలో దాదాపు 150కి చెరువులు ఉండగా అన్ని చెరువులు నిండి ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురింపజేశాయి. ఆదివారం రాత్రి మద్దూరులో 42.4మిల్లీమీటర్లు, కొత్తపల్లిల్లో 25 మిల్లీమీటర్ల రికార్డు స్థాయిలో వర్షం కురవడంతో చెరువులన్నీ నిండి అలుగు పారుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో నిడ్జింత వాగు, భూనీడు వాగు, లింగాల్‌చేడ్ పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

నిలిచిన రాకపోకలు

గతవారం రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా పారడంతో నిడ్జింత మద్దూరు, కొత్తపల్లి, భూనీడు మధ్య ఉన్న వంతెన నిర్మాణాలు కొనసాగే ప్రదేశాల్లో తాత్కాలిక వంతెనలు నిర్మించారు. ఎడతెరిపి లేని వర్షాలకు వాగుల్లో వరద ఉధృతి ఎక్కువ కావడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మండల కేంద్రాలకు మహబూబ్‌నగర్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పత్తి పంటకు తీవ్ర నష్టం

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పత్తి సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మండలంలో 4000 ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. పత్తిని తీయాల్సిన సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని పత్తి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



అలుగు దూకుతున్న రెనివట్ల పెద్ద చెరువు



నిండుకుండలా ఖాజీపూర్ చెరువు



అలుగు పారుతున్న భూనీడు అమ్మ చెరువు

భారీ వర్షంతో తెగిన వాగులు

కోస్గి రూరల్: మండల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో వరద ఉధృతికి తాత్కాలిక బ్రిడ్జిలు తెగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముశ్రీపా వాగుపై నిర్మించిన తాత్కాలికంగా బ్రిడ్జి ఇప్పటి వరకు నాలుగు సార్లు తెగిపోవడంతో దౌల్తాబాద్ మండలం నుంచి కోస్గికి రాకపోకలు నిలిచిసోయాయి. అలాగే ముంగిమళ్ల గ్రామం నుంచి ముక్తిపాడ్, బిజ్జారం గ్రామం నుంచి మద్దూర్ మండలంలోని పల్లేర్లకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రెవన్యూ, మండల పరిషత్ సిబ్బంది, పోలీసులు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న ముశ్రీపా వాగు